


# సోషలిజం

రామనాథం రిక్షా దిగి గబగబా ''బుక్ స్టాల్'' కేసి నడిచాడు. రెండు తెలుగు దిన పత్రికలు, ఒక యింగ్లీషు దినపత్రిక, ఓ రెండు తెలుగు వార పత్రికలు, ఓ సినిమా వారపత్రిక, ఓ ఆంగ్ల పక్షపత్రిక, ఒక తెలుగు మాస పత్రిక కొనేశాడు. అతని తీరే అంత! చేతిలో డబ్బుండాలే కాని రోజూ ఇదే తంతు!

రామనాథం ప్లాటుఫారం మీదకు వచ్చాడు. గుంటూరునుంచి బెజవాడ పోయే రైలు బయలుదేరు దానికి సిద్ధంగా వుంది. బండెక్కి కూర్చున్నాడు. అంతలో బండి బయలుదేరింది.

సిగరెట్టు ముట్టించి పేపర్ల కట్ట తెరిచాడు. తెరిచాడో లేదో ప్రక్కన కూర్చున్న పెద్ద మనిషి 'పేపర'డిగాడు. రామనాథం ఇచ్చాడు. ఈ ప్రక్కన కూర్చున్నవాడు ఇంకో పేపరడిగాడు. ఇచ్చాడు.

''ఏమండీ ఆ వార పత్రిక యిస్తారా- దయచేసి- 'ఫలానా' సీరియల్ కాస్త చదివిస్తాను'' అన్నది ఓ యిల్లాలు.

''ఫలానా లాటరీ రిజల్టు పడేది ఈ రోజే! కాస్త ఆ 'షీటు' యిప్పించండి'' -ఓ పజిల్సు పిచ్చగాడు.

''వార ఫలాలు చూసిస్తాను- ఈ వారం మన జాతకం యెలా వుందో! ఆ వారపత్రిక యిప్పించండి బాబూ'' -ఓ ముసలాయన.

''ఆ మాస పత్రిక ఒకసారి యిస్తారా- ఈ నెలలో యే మినీ నవల వచ్చిందో చూసిస్తాను'' -ఓ మధ్యవయస్కురాలు.

''ఉద్యోగ ప్రకటనలు చూసిస్తాను. ఆ ఇంగ్లీషు పేపరొకసారివ్వండి''- ఓ నిరుద్యోగి.

''ఆ సినిమా వారపత్రిక ఇస్తారా? బొమ్మలు చూసిస్తాను'' ఓ అమ్మాయి.

''బోఫోర్స్ ముడుపుల గురించి వ్రాసినట్లుంది- ఈ ఇంగ్లీషు పక్ష పత్రిక ఇవ్వండి చూసిస్తాను'' -ఓ సూట్ వాలా.

ఇలా తలా ఒకరు తలా ఒక పేపరడిగి తీసేసు కున్నారు. రామనాథానికి మతిపోయింది: పేపర్లు తనవి. తను కొనుక్కున్నాడు డబ్బిచ్చి- చదవడానికే కదా! వాళ్ళకున్న ఆదుర్దా తనకు మాత్రం వుండదా పేపరు చదవాలని! ఇన్ని కొన్నా ఒక్క పేపరూ తన వద్ద లేదు. మథనపడ్డాడు. లోపల కోపమొచ్చింది- అయితే తమాయించుకున్నాడు.

బండి నంబూరు స్టేషను దాటింది. పేపర్లు, వారపత్రికలు చేతులు మారిపోతున్నాయి. పేపర్లు అసలు మరలా తన చేతికొస్తాయా? అనుమానం వచ్చింది. చిర్రెక్కింది. ఉండబట్టలేక ఆవేశంతో అడిగాడు ప్రక్కనున్న పెద్దమనిషిని పేపరిమ్మని. పలుకలేదు. ఈ ప్రక్కనున్న అతన్ని అడిగాడు 'ఇస్తామండండీ'' అని విసుక్కున్నాడతను. వాళ్ళిద్దరి చేతుల్లో పేపర్లు లాక్కోవడానికి ప్రయత్నించాడు రామనాథం.

''ఏమిటండీ ఈ తొందర. చదువుతున్నాగా. మీ పేపరు మీకివ్వకుండా పోతామనా భయం?'' అన్నాడు పెద్దమనిషి.

''ఇంతలో మీ బంగారం మేమేం పట్టుకు పోములే'' రెండవ అతని ఈసడింపు.

బండి మంగళగిరి దాటిపోయింది! రామనాథానికి సహనం చచ్చిపోయింది. కడుపు మండిపోతోంది. రెచ్చిపోయాడు. పిచ్చిగా ఒకసారి పెద్దగా అరిచాడు.

''చూడండీ! నా పేపర్లు నాకు తిరిగి మర్యాదగా ఇస్తారా లేదా?'' ఒక్క క్షణం అంతా నిశ్శబ్దం. మళ్ళీ పెద్దగా అన్నాడు రామనాథం ''పేపర్లు నావి. డబ్బిచ్చి కొనుక్కున్నాను, చదువుకోవడానికి. పేపర్లు చదవ డానికి మీకెంత ఇంటరెస్టు, ఆదుర్దా వుందో నాకూ అంతే వుంది. ఏం మీరు కొనుక్కోలేరా? పేపరు కొనే తాహతు మీకు లేదా? అందరూ బాగా వున్నవాళ్ళలాగే వున్నారే. తిండికి లేనివాళ్ళు కాదుగా- ఏమిటి మీకీ దౌర్భాగ్యం- ఏమో ఈ దేశం ఎప్పుడు బాగుపడుతుందో! నా పేపర్లు నాకు మర్యాదగా ఇస్తారా లేదా-'' మళ్ళీ గట్టిగా అడిగాడు.

ఒకళ్ళిద్దరు తిరిగిచ్చేరు పేపర్లు. అంతలో ఒకడు వుద్రేకంగా ''ఏం- యివ్వం- ఏం చేస్తావ్? కొడతావా,
చంపుతావా?'' అంటూ ప్రక్క మనిషి చేతిలో పత్రిక లాక్కొని చింపి రామనాథంకేసి విసిరాడు. మొహం మీద పడింది అది. మిగిలినవాళ్ళూ రుసరుస లాడుతూ పేపర్లు పత్రికలు రామనాథం మొహంకేసి విసిరికొట్టారు.

రైలు తాడేపల్లి స్టేషను దాటింది.

''మీరు మనుషులా పశువులా- బుద్ధుందా లేదా! నా పేపర్లు నా కివ్వమంటే విసిరికొడతారా! చింపి పారేస్తారా'' ఆవేశంతో వూగిపోతున్నాడు రామనాథం.

పరిస్థితి విషమించింది. ఆవేశాలు ఆగ్రహాలు పెరిగిపోయాయి. రామనాథం మీదమీదికి వచ్చేరు యిద్దరో ముగ్గురో. రామనాథం కూడా ఎదురు వెళ్ళాడు. ఒకరినొకరు దుర్భాషలాడుకోవడం, ఒకరి మీదికి ఇంకొకరు పోవడం, చేయి చేయి పట్టుకోవడం, చివరకు చొక్కాలు గుంజుకోవడం వరకు వెళ్ళింది.

రైలు కృష్ణా బ్రిడ్జి మీదికొచ్చింది. డబడబా శబ్దం. రైలుపెట్టెలో దెబ్బలాడుకోవడం! ఏం జరుగుతుందో ఎవరికీ తెలియడం లేదు. అంతా అరుపులే! ఇంతలో ఎవరో పెద్దాయన కలుగజేసుకుని అందర్నీ సర్దాడు.

రైలు బ్రిడ్జి దాటింది. అంతా నిశ్శబ్దం. చూస్తే రామనాథం చొక్కా చిరిగుంది! దిగాలుపడిపోయినా ఏదో గొణుగుతున్నాడు! తిడుతున్నాడు!

ఇంతలో గొలుసు లాగేరెవరో! బండి ఆగింది. గబగబా అందరూ దిగిపోతున్నారు. ఆ పెద్దాయన రామనాథంతో ''చూడు బాబు! కాలం మారి పోయింది. 'నాది' అనే రోజు పోయే రోజులొచ్చాయి! న్యాయమెక్కడ! త్వరలోనే వున్నవాళ్ళ ఇళ్ళల్లోకి లేని వాళ్ళు జొరబడి దోచుకొని పైగా చంపేస్తామని బెదరించే రోజులొస్తాయేమో... ఏమీ బాధపడకు బాబు'' అంటూ దిగిపోయాడు.

రామనాథం ఆ పెద్దాయనకేసి అదోలా చూస్తుండి పోయాడు!

—అమూల్యశ్రీ

### భాస్వరం

ఎల్.ఆర్. ఈశ్వరి చలనచిత్ర సీమలో ఉజ్వ లంగా వెలుగుతున్న రోజులు అవి. ఆ రోజుల్లో ఓ చలన చిత్ర శతదినోత్సవ సభకు డాక్టర్ సి.నారా యణరెడ్డి వ్యాఖ్యాతగా వ్యవహరించేరు. ఆయన ఎల్.ఆర్. ఈశ్వరిని వేదికపైకి ఆహ్వానిస్తూ—

''స్వరంలో 'భాస్వరం' వున్న ఎల్.ఆర్. ఈశ్వరి'' అంటూ చమత్కరించేరు.

—మాలిని